# తెలుగువాళ్ళం

ర్రీలవాటు ప్రకారంగా ఆరోజు సాయంత్రం పంజాబీ హోటల్లో నేను నా మిత్రుడు స్పెషల్ టీ త్రాగుతున్నాం ఓ వ్యక్తి కెదురుగా వచ్చి కూర్చున్నాడు

"నాకు ఒక మంచి టీ తీసుకురండి" అన్నాడు సర్వర్‌తో

అతను తెలుగు మాట్లాడే తీరు వింతగా వుండటం వల్ల నాకు నవ్వొచ్చింది

అతను తన చేతివాచీని చెవిదగ్గ రుంచుకుని నావేపు చూస్తూ అడిగేడు "ఏమండీ! మీ గడియారంలో ఎన్ని గంటలు అయినవి?"

వెంటనే బాచి నవ్వుతూ చెప్పేడు "సిక్స్ ఫిఫ్టీన్ సార్!"

"నా పేరు జేమ్స్! నాది అమెరికా దేశం! ఇక్కడ యూనివర్సిటీలో తెలుగు డిప్లొమా చదువుకుంటున్నాను" ఎంతో కష్టంమీద తెలుగులోనే తనను తాను పరిచయం చేసుకున్నాడు జేమ్స్ తర్వాత మా వివరాలు కూడా అడిగి తెల్సుకున్నాడు

"ఈమధ్య వివేకానంద హాలులో బిస్మిల్లాగారి షెహనాయి విన్నాను చాలా చాలా బాగుంది." జేమ్స్

"అవునండి ఆ ప్రోగ్రామ్‌కి నేను కూడా అటెండయాను రియల్లీ వెరీ గుడ్!" నేను

"సుబ్బలక్ష్మిగారి పాటలు కూడా విన్నాను ఎంతో బాగున్నాయి"

"యస్! షి ఈజ్ ఎ గుడ్ సింగర్!" బాచి

"ఆవిడ పాడిన సుప్రభాతం మీరు విన్నారా?" నేను

"రేడియోలో శనివారం వస్తుంది అదేకదండీ?"

"దట్ వన్ ఓన్లీ!" బాచి

"ఎంతో బాగుంటుందండి"

"మీరు తెలుగు సినిమా లేమైనా చూశారా?" నేను

"ఓ! మిస్సమ్మ సినిమా చూశాను చాలా హాస్యముగా వున్నది అందులో 'బాబూ! గ్రుడ్డివాడిని బాబూ! ధర్మం చేయండి!—' అన్న అతని నటన చాలా చాలా బాగుందండి మంచి హాస్యగాడు"

"దట్ మేన్ రేలంగి! రియల్లీ ఎ వెరీ గుడ్ కమేడియన్!" బాచి

"అవునండి" జేమ్స్

"మిస్టర్. జేమ్స్! హౌ ఆర్ యూ ఫీలింగ్ దిస్ వైజాగ్?" బాచి

"చాలా చాలా బాగుందండి ఈ సాయంత్రము నాకు బాగా గడచినది నేను యూనివర్సిటీ హాస్టలుకి వెళ్ళిపోవాలి సెలవు తీసుకుంటాను. నమస్కారమండి వస్తాను" అంటూ లేచాడు జేమ్స్

"సీయూ" బాచి

—సుస్మితా రమణమూర్తి